GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 107 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 26-12-2024 | పేజీలు : 4

## యాసిడ్ తాగి యువతి మృతి..



**టి మీడియా, డిసెంబర్ 25,హైదరాబాద్:** నగరంలోని జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటు చేసుకుంది. యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డిగ్రీ విద్యార్థిని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ భవానీ నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థిని పూర్ణిమ.. మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగానే యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ప్రేమ పేరుతో నిఖిల్ అనే యువకుడు వేధిస్తున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు ఆరోపించారు.

# ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు భేటీ



- రాష్ట్రానికి రావాల్సిన నిధులు
- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం
- అమరావతికి రైల్వే లైన్ అంశంలుచర్చ

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. బుధవారం సాయంత్రం ప్రధాని మోదీతో భేటీ అయిన చంద్రబాబు.. పలు కీలక అంశాలపై చర్చించారు.. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం ప్రాజెక్టుకి నిధులు, అమరావతికి రైల్వే లైన్, కేంద్ర సంస్థల తరలింపు వంటి అంశాలపై చర్చించారు. ఏపీ కీలక ప్రాజెక్టులకు నిధుల అంశంతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై ప్రధానితో చంద్రబాబు చర్చించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధానిని కోరారు. ఏపీ ఆర్థిక పరిస్థితులు రాష్ట్ర అభివృద్ధికి సహకారం అంశాలను..ప్రధాని మోదీ దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లారు. అమరావతి రాజధానికి బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. 15 వేల కోట్ల సాయాన్ని వేగవంతం చేయాలని కోరారు. విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపనకు రావాలని ప్రధాని మోదీని చంద్రబాబు కోరారు.. పోలవరం నిర్మాణానికి సహకారంతో పాటు వరద సెస్‌కు అనుమతి ఇవ్వాలని కోరారు.ప్రధానితో భేటీ అనంతరం కేంద్రమంత్రులు అమిత్‌షా, నిర్మలా సీతారామన్‌తో సమావేశం అయ్యారు. అమరావతి అభివృద్ధికి ఆర్థికంగా తోడ్పాటు అందించడంతో పాటు.. పెండింగ్ నిధులు విడుదల పైన కేంద్ర ఆర్థిక మంత్రితో చంద్రబాబు డిస్కస్ చేశారు. ఇలా రోజంతా కీలకనేతలతో పలు అంశాలపై చంద్రబాబు కీలక చర్చలు జరిపారుఢిల్లీ టూర్‌లో భాగంగా బుధవారం ఉదయం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రీయ స్మృతిస్థల్‌కు చేరుకున్నారు.. కేంద్ర పెద్దలు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలతో కలిసి వెళ్లిన చంద్రబాబు.. సదైవ్ అటల్ ఘాట్ దగ్గర దివంగత ప్రధాని వాజ్‌పేయి పుష్పాంజలి ఘటించారు. కాసేపు అక్కడే ఉండి ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ఎన్డీఏ నేతల కీలక సమావేశం..** మధ్యాహ్నం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్ డి ఎనేతలు, రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని..దీనిపై ఎన్డీఏ పక్షాలు ఎదురుదాడి చేయాలని బీజేపీ కోరుతోంది. దీనిపై వ్యూహాన్ని రచించేందుకు ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే జమిలి ఎన్నికల బిల్లు, ఎన్నికల సంఘం తీసుకు వచ్చిన నూతన సంస్కరణలపై కూడా చర్చించినట్లు సమాచారం. జనవరి 8వ తేదీన జమిలి ఎన్నికలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ తొలి సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా ఎన్డీఏ మిత్రపక్షాలు డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ సమావేశం అనంతరం కేంద్ర ఉక్కుమంత్రి హెచ్.డి. కుమారస్వామితో భేటీ అయ్యారు చంద్రబాబు.. ఈ భేటీలో వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరించకుండా..ఏం చెయ్యాలి? సెయిల్‌లో విలీనం చెయ్యాలా, ఇంకేదైనా మార్గం ఉందా అనే అంశంపై చర్చించినట్లు సమాచారం. కుమారస్వామితో భేటీ అనంతరం.. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవితో భేటీ అయ్యారు. పెండింగ్ ప్రాజెక్టుల పైన చర్చించారు. అలాగే ఇటీవల ఏపీ రాజధాని కోసం మంజూరైన రైలు మార్గం పనులను వీలైనంత తొందరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిని చంద్రబాబు కోరారు.

## ఘనంగా క్రిస్‌మస్ వేడుకలు..

-పలువురు ప్రముఖుల శుభాకాంక్షలు..

-ప్రార్థనల్లో పాల్గొన్న జగన్, విజయమ్మ

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,ఢిల్లీ :** ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్‌మస్ వేడుకలను జరుపుకుంటున్నారు. చర్చిలు గత రాత్రి నుంచివిద్యుద్దీపాల అలంకరణలతో కనపడుతున్నాయి. కేరళలోని ఎర్నాకులంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసి రోమన్ క్యాథలిక్ మెట్రోపాలిటన్ కేథడ్రల్‌ను లైట్లు, క్రిస్మస్ క్రిబ్‌లతో అందంగా అలంకరించారు.

### తెలుగు రాష్ట్రాల్లో వేడుకలు

మెదక్ కెథడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజామున 4.30 గంటలకు ప్రాతఃకాల ఆరాధనతో మెదక్ చర్చిలో క్రిస్మస్ మహోత్సవం ప్రారంభమైంది. చర్చి ఆనవాయితీ ప్రకారం శిలువను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఇన్‌చార్జి బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ భక్తులకు దైవవాక్య సందేశం ఇచ్చారు.ఏసు ప్రభువు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ పండుగను ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ఈ పండుగకు సర్వాంగ సుందరంగా చర్చీలు ముస్తాబు అయ్యాయి. క్రైస్తవ మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని సీఎస్ఐ చర్చిలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. క్రైస్తవులందరికి క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలిపారు.

### చంద్రబాబు ట్వీట్

"సర్వ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త యేసు క్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ దినం.



క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు నా శుభాకాంక్షలు. ప్రేమ మార్గంలో ఎవరి మనసునైనా జయించవచ్చునని తన జీవితం ద్వారా నిరూపించిన క్రీస్తు మార్గంలో నడుస్తూ సాటి మనిషికి మేలు చేయడమే మన ముందున్న కర్తవ్యం. ప్రేమ, కరుణ, సహనం, దయ, త్యాగ గుణాలను అలవాటు చేసుకుని జీవితాన్ని శాంతిమయం చేసుకుందాం. సర్వ మానవాళికి మేలు కలగాలని ప్రభువును ప్రార్థిద్దాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. పులివెందులలో క్రిస్‌మస్ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ పాల్గొన్నారు. సీఎస్ఐ చర్చిలో తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి భారతి రెడ్డితో కలిసి ప్రార్థనలు చేశారు.

### వాజ్‌పేయికి

## ముర్ము, మోదీ, చంద్రబాబు నివాళులు

- సేవలను గుర్తు చేసుకున్న నేతలు



**టి మీడియా, డిసెంబర్ 25, ఢిల్లీ:** భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్?పేయి శత జయంతి సందర్భంగా ప్రముఖులు ఆయనకు నివాళు లర్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్?సభ స్పీకర్ ఓం బిర్లా, పలువురు కేంద్ర మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీలోని 'సదైవ్ అటల్'ను బుధవారం ఉదయం సందర్శించారు.

**పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు**

ఈ క్రమంలో పూలమాలలు వేసి వాజ్‌పేయికి నివాళు లర్పించారు. వాజ్‌పేయి స్మారకార్థం ఏర్పాటు చేసిన ప్రార్థనా సమావేశంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో వాజ్?పేయి సేవలను గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత వాజ్‌పేయికి ఆయన దత్తపుత్రిక నమితా కౌల్ భట్టాచార్య సైతం నివాళులర్పించారు.

**'దేశ నిర్మాణం కోసం జీవితాన్ని అంకితం చేశారు'**

"మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. బలమైన, స్వావలంబన, సంపన్నమైన దేశాన్ని నిర్మించడానికి వాజ్ పేయి తన జీవితాన్ని అంకితం చేశారు. భారత్?ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి ఆయన దార్శనికత, లక్ష్యం కొనసాగుతుంది. గౌరవనీయులైన అటల్ బిహారీ వాజ్?పేయి రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ దేశానికి కొత్త దిశను, వేగాన్ని అందించారు. ఆయన సహవాసం, ఆశీస్సులు నాకు లభించడం నా అదృష్టం" అని ప్రధాని మోదీ ఎక్స్?లో పోస్టు చేశారు

**జాతి గర్వించదగిన నేత**

మాజీ ప్రధాని వాజ్‌పేయి దూరదృష్టి వల్లే భారత్ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేశారు. 'భారతజాతి గర్వించదగిన నేత వాజ్‌పేయి. ఆయన దూరదృష్టి వల్లే ప్రస్తుతం మన దేశం ప్రపంచదేశాలతో పోటీ పడుతోంది. దేశం గురించి వాజ్‌పేయి ఆలోచించే తీరు విలక్షణమైనది. సంస్కరణల ప్రతిపాదనలపై వాజ్‌పేయి స్పందించిన తీరు ఎన్నటికీ మరచిపోలేను. ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నాను' అని ఎక్స్ లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పోస్ట్ చేశారు.

**'ఆయన జీవితం దేశానికే అంకితం'**

మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతిని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. వాజ్ పేయి రాజకీయాలలో గొప్ప ఆలోచనాపరుడని, ఆయన జీవితాన్ని దేశ ప్రతిష్ఠకు, సేవకు, అభివృద్ధికి అంకితం చేశారని కొనియాడారు. ఆయనతో కలిసి చాలా కాలం పని చేసే అవకాశం కూడా వచ్చిందని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వాజ్‌పేయి కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

**'ఆయన అడుగుజాడల్లోనే'**


దేశానికి అటల్ బిహారీ వాజ్ పేయి లాంటి నాయకుడు దొరకడం గర్వించదగ్గ విషయమని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలిపారు. వాజ్‌పేయి అడుగుజాడల్లో నడుస్తామని పేర్కొన్నారు.

సంఘ సంస్కర్త, సాహిత్యవేత్త కూడా!

అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయ వేత్త మాత్రమే కాదు దేశభక్తుడు, సాహిత్యవేత్త, సంఘ సంస్కర్త కూడా అని కొనియాడారు కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ. ప్రస్తుత కాలంలోని రాజకీయ నాయకులు వాజ్?పేయి అడుగుజాడలను అనుసరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆయన చేసిన పనులన్నీ ప్రస్తుత ప్రభుత్వానికి మార్గనిర్దేశం చేస్తున్నాయని కేంద్ర మంత్రి, అప్నాదళ్ నేత అనుప్రియా పటేల్ వ్యాఖ్యానించారు.

## ఇంజినీరింగ్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

- అన్నా యూనివర్సిటీలో దారుణం



టి మీడియా, డిసెంబర్ 25, చెన్నై: తమిళనాడులోని ప్రతిష్ఠాత్మక అన్నా యూనివర్సిటీ కాంపస్‌లో దారుణం జరిగింది. ఓ ఇంజినీరింగ్ విద్యార్థినిని ఇద్దరు దుండగులు కలిసి అత్యాచారం చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది.బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, 'డిసెంబర్ 23 రాత్రి బాధితురాలు, ఆమె స్నేహితుడు కలిసి అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో కలిసి మాట్లాడుకుంటున్నారు. ఇంతలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, ఆమె స్నేహితుడిని దారుణంగా కొట్టి బయటకు తరిమేశారు. తరువాత వారిద్దరూ కలిసి ఆమెను దారుణంగా అత్యాచారం చేశారు. తరువాత ఆమెకు సంబంధించిన అభ్యంతరకరమైన (నగ్న) ఫొటోలను తమ సెల్‌ఫోన్‌తో తీశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే, ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తామని బెదిరించారు. తరువాత ఆమెను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.' అయినప్పటికీ ఆమె భయపడకుండా మరుసటి రోజు తన స్నేహితుడితో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్లి స్వయంగా ఫిర్యాదు చేశారు.

ఓ నిందితుడు అరెస్ట్

బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోనికి దిగిన పోలీసులు భారతీయ న్యాయ సంహిత, సెక్షన్ 64 ప్రకారం రేప్ కేస్ నమోదు చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ సాయంతో ఓ నిందితుని ఇప్పటికే పట్టుకున్నారు. మరో నిందితుడి కోసం 4 స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి.

తమిళనాడులో లా అండ్ ఆర్డర్ ఉన్నాయా

ఈ అత్యాచార ఘటనపై తమిళనాడు ప్రభుత్వాన్ని విపక్షాలు దుయ్యబట్టాయి. మాజీ ముఖ్యమంత్రి ఎలప్పాడి పళనిస్వామి ఈ అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. తమిళనాడు నడిబొడ్డులో ఉన్న అన్నా యునివర్సిటీలో ఇలాంటి ఘటన జరగడం సిగ్గుచేటన్నారు. ఢిల్లీలో నిర్భయ అత్యాచారం జరిగిన 12 ఏళ్ల తరువాత, తమిళనాడులో ఇలాంటి ఘటన జరిగిందని, ఇది రాష్ట్రంలో శాంతి, భద్రతలు ఎంతగా క్షీణించాయో తెలియజేస్తుందని అన్నారు.తమిళనాడు బీజేపీ నాయకుడు అన్నామలై ఎక్స్ వేదికగా ఈ అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు తమిళనాడు ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### శ్రీతేజ్‌ను పరామర్శించిన

## అల్లు అరవింద్, దిల్ రాజు

- కుటుంబానికి మొత్తం రూ.2 కోట్ల పరిహారం

**టి మీడియా, డిసెంబర్ 25, హైదరాబాద్ బ్యూరో** : సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో శ్రీతేజ్ కుటుంబానికి రూ. 2కోట్ల పరిహారాన్ని అందజేయనున్నట్లు నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను నిర్మాత దిల్ రాజుతో కలిసి పరామర్శించిన అనంతరం పరిహారాన్ని అల్లు అరవింద్ ప్రకటించారు. హీరో అల్లు అర్జున్ తరఫున రూ.కోటి, పుష్ప-2 నిర్మాతలు, దర్శకుడు సుకుమార్ చెరో రూ. 50 లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత చెక్కులను ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజుకు అల్లు అరవింద్ అందజేశారు. ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్‌రాజు, పుష్ప-2 నిర్మాత రవిశంకర్‌తో అల్లు అరవింద్ కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి శ్రీతేజ్‌ను పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాలుడు తండ్రి బాస్కర్‌తో అల్లు అరవింద్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో పరిహారం వివరాలను వెల్లడించారు. బాలుడు(శ్రీతేజ్) త్వరలోనే కోలుకుని మనందిరిలో తిరుగుతాడని విశ్వసిస్తున్నాం. ప్రస్తుతం ఇక్కడకు రావడానికి కారణం శ్రీతేజ్? కుటుంబానికి రెండు కోట్ల రూపాయలు ఆర్థిక సాయం అందించేందుకు. మా తరఫునుంచి (అల్లు అర్జున్ తరఫు) కోటి రూపాయలు, నిర్మాతలు రవి, నవీన్ కలిపి రూ. 50 లక్షలు మైత్రీ తరఫున, సుకుమార్ తరఫున రూ. 50 లక్షలు ఇచ్చారు. ఈ మొత్తం 2 కోట్ల రూపాయలకు సంబంధించిన చెక్కును ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజుకు అందజేసి బాధిత కుటుంబానికి అందజేయాలని విజ్ఞప్తి చేశాం. ఎఫ్‌డీసీ తరఫున సీఎంను కలవబోతున్నాం : ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు మాట్లాడుతూ బాబు వేగంగా



కోలుకుంటున్నాడని పరిహారం సొమ్ము సద్వినియోగం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేపు ఉదయం 10 గంటలకు సీఎంతో సినీ ప్రముఖులు భేటీ కానున్నారని వివరించారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం జరగనుంది. సీఎంతో తాజా పరిణామాలు, చిత్ర పరిశ్రమ అభివృద్ధిపై భేటీలో చర్చించనున్నట్లు సమాచారం. భేటీకి సంబంధించి ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఇప్పటికే ప్రకటించారు. 'సీఎంతో భేటీపై హీరోలు, నిర్మాతలకు సమాచారం ఇస్తున్నా' అని దిల్‌రాజు తెలిపారు. సినిమా మనిషిగా చిత్రపరిశ్రమకు వారధిగా ఉంటాననే తనను ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించారని దిల్?రాజు తెలిపారు. శ్రీతేజ్‌కు జానీమాస్టర్ దంపతుల పరామర్శ సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను పుష్ప2 చిత్ర నిర్మాత రవిశంకర్ కూడా పరామర్శించారు. జానీ మాస్టర్ దంపతులు కూడా శ్రీతేజ్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు.

## మూడు రోజులు భారీ వర్షాలు

- మూడో ప్రమాద హెచ్చరిక జారీ

**టి మీడియా, డిసెంబర్ 25,విశాఖపట్నం:** నైరుతి, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర భారతం మీదుగా వెళ్తున్న పశ్చిమద్రోణి అల్పపీడనాన్ని, తేమను తనవైపు లాగడానికి ప్రయత్నిస్తోంది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ బుధవారం క్రమంగా బలహీనపడుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.దానికి అనుబంధం గా 4.5 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. బుధవారం మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసింది. రాష్ట్రంలోని అన్ని పోర్టుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. శనివారం తర్వాత రాష్ట్రంలో వర్షాలు తగ్గుతాయి. మంగళవారం అల్లూరి సీతారామరాజు, విజయనగరం, కృష్ణా, బాపట్ల, ఏలూరు, తూర్పుగోదావరి, విశాఖపట్నం తదితర జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. చలిగాలులు వీచాయి. అల్పపీడనం తీరానికి సమీపంలో కేంద్రీకృతమై ఉండడంతో తీరప్రాంత జిల్లాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి.

## సెకండ్ హ్యాండ్ కార్ల కొనుగోలుపై జీఎస్టీ

### జీఎస్టీ కౌన్సిల్ లో గ్ నిర్ణయం

**టి మీడియా, డిసెంబర్ 25, ఢిల్లీ:** కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. సెకండ్ హ్యాండ్ కార్లపై ఉన్న జీఎస్టీని 12 నుంచి 18 శాతానికి పెంచారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో జైసల్మేర్ లో డిసెంబర్ 21న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు వస్తువులపై ఉన్న జీఎస్టీ శ్లాబులను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పాప్ కార్న్ నుంచి పాత కార్ల వరకూ వర్తింపజేశారు. దీనిలో భాగంగా పాత కార్ల విక్రయాలపై ఇప్పటికే ఉన్న 12 శాతం పన్నును 18 శాతానికి పెంచారు. నిబంధనల ప్రకారం 1200 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం, 4 వేల ఎంఎం కంటే ఎక్కువ పొడవైన పెట్రోల్ కార్లు, 1500 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం, 4 వేల ఎంఎం కంటే పొడవైన డీజిల్ కార్లతో పాటు ఎలక్ట్రిక్ కార్లపై కూడా ఇప్పటి వరకూ 12 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీని పొడిగిస్తూ కొత్తగా నిర్ణయం తీసుకున్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాన్ని సరిగ్గా అర్థం చేసుకోకపోవడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. పాత కార్లపై 18 శాతం పన్ను వసూలు చేస్తారన్నది నిజమే. అయితే ఇది వ్యక్తిగతంగా కార్లను విక్రయించిన వారికి వర్తించదు. కేవలం పాత కార్లను అమ్మే డీలర్లపైనే పడుతుంది. అంటే ఒక వ్యక్తి మరో వ్యక్తికి తన కారును విక్రయిస్తే ఎలాంటి పన్ను కట్టనవసరం లేదు. అమ్మేవారు, కొనేవారికి కూడా నిబంధన వర్తించదు. కానీ సెకండ్ హ్యాండ్ కార్లను అమ్మే డీలర్ల నుంచి వాహనాన్ని కొనుగోలు చేస్తే మాత్రం తప్పనిసరిగా కట్టాలి. పాత కారును విక్రయించినప్పుడు వచ్చిన లాభంపైనే డీలర్లు జీఎస్టీ కట్టాల్సి ఉంటుంది. అంతే కానీ ఆ కారును అమ్మిన మొత్తంపై కాదు. ఉదాహరణకు ఒక వ్యక్తి రూ. 10 లక్షలకు కారును కొనుగోలు చేశాడు. కొంత కాలం వాడిన తర్వాత దాన్ని రూ. 8 లక్షలకు ఒక డీలర్ కు విక్రయించాడు. అనంతరం డీలర్ ఆ కారును రూ. 9 లక్షలకు మరో వ్యక్తి అమ్మాడు. ఆ సమయంలో డీలర్ కు వచ్చిన లాభం రూ. లక్షపైనే 18 శాతం జీఎస్టీ కట్టాలి. ఒక వేళ ఆ కారును కొనడానికి ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో డీలర్ దాన్ని రూ. 8 లక్షల కంటే తక్కువకు అమ్మేశాడు. ఈ లావాదేవీలో అతడికి నష్టం వచ్చింది. కాబట్టి జీఎస్టీ కట్టనవసరం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సెకండ్ హ్యాండ్ కార్ల పరిశ్రమను దెబ్బతీస్తుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## ప్రిన్సిపాల్ వేధింపులు

2

# ప్రిన్సిపాల్ వేధింపులు

**- గురుకుల విద్యార్థుల 18 కి.మీ. పాదయాత్ర**

**-గద్వాల కలెక్టర్‌కు ఫిర్యాదు**



**టీ మీడియా ,డిసెంబర్ 25 , ఎర్రవల్లి :** తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం బీచుపల్లిలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు 200 మంది ఆందోళన బాట పట్టారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ తమను వేధిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారు మంగళవారం పాఠశాల, కళాశాల ప్రహరీ దూకి కాలినడకన బీచుపల్లి నుంచి గద్వాలలోని కలెక్టరేట్‌కి 18 కి.మీ. పాదయాత్ర ద్వారా చేరుకుని సమస్యలు విన్నవించుకున్నారు. అ తర్వాత విద్యార్థులు తాము ఎందుకు ఇలా బయటకు వచ్చింది చెప్తూ మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో ప్రిన్సిపాల్ నిత్యం క్రమశిక్షణ పేరుతో విద్యార్థులను వేధిస్తూ కొడుతున్నారని ఆరోపించారు. స్టడీ మెటీరియల్ కూడా పంపిణీ చేయలేదని, విద్యాబోధన సక్రమంగా లేదన్నారు. గురుకులంలో విద్యార్థులందరికి మరుగుదొడ్లు సరిపడా లేకపోవడంతో వారు బహిర్భూమికి చెట్లు, గుట్టల్లోకి పోతున్నామని విద్యార్థులు వాపోయారు. తమకు రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. తమ సమస్యలు అన్నింటినీ కలెక్టర్ దృష్టికి తీసుకురావడానికే విద్యార్థులంతా పాదయాత్రగా ఇక్కడి వచ్చామని తెలిపారు.

**ఆ తెలుగు ఉపాధ్యాయుడు మాకొద్దు**

అంతే కాకుండా తమ పాఠశాల ప్రిన్సిపల్? 6వ తరగతిలో మిగిలిన సీట్లను అమ్ముకున్నారని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని విద్యార్థులు వివరించారు. విద్యార్థులను గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి వీరాపురం స్టేజీ వద్ద కలిసి, సమస్యలు తెలుసుకుని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మధ్యలో ఇటిక్యాల పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వారించి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా విద్యార్థులు ర్యాలీ కొనసాగించారు. సుమారు 200 మంది ర్యాలీగా వెళ్తుండటంతో పోలీసులు బందోబస్తుగా వెళ్లారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టలేదు : ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను దీనిపై వివరణ కోరగా విద్యార్థులు ఉపాధ్యాయుల అనుమతిలేకుండా బయటకు వెళ్లి చెడు అలవాట్లు చేసుకుంటుండటంతో హెచ్చరించానన్నారు. అందులో భాగంగానే ఓ విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించామన్నారు. అంతే కానీ విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులు పెట్టలేదని వివరించారు.

# బీపీతో బాధపడుతున్నారా..?

**- ఇవి తింటే అదుపులో ఉంటుందట**

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,ఆరోగ్యం :** మారిన జీవనశైలి, ఆహార అలవాట్లు.. ఇలా కారణాలు ఏమైతేనేమి వృద్ధాప్యంలో రావాల్సిన అనారోగ్య సమస్యలు 40 ఏళ్ల లోనే వచ్చేస్తున్నాయి. అందులో హైబీపీ కూడా ఒకటి. ప్రస్తుతం చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే బీపీ నార్మల్?కు వచ్చేందుకు మందులు వాడుతుంటారు. ఉప్పు వాడకాన్ని తగ్గిస్తారు. అయినా.. రక్తపోటు అదుపులో ఉండట్లేదని వాపోతుంటారు. అయితే.. మెడిసిన్? వాడడం, ఉప్పును తగ్గించిన మాత్రాన బీపీ కంట్రోల్?లోకి వచ్చేయదంటున్నారు నిపుణులు. రక్తపోటు కంట్రోల్?లో ఉండాలంటే.. కొన్ని ఫుడ్స్?ను ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు. అవేంటో చూద్దాం....

సిట్రస్ పండ్లు: పండ్లు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా రోజుకు 400 గ్రాముల ఫ్రూట్స్‌ను తినాలని సలహా ఇచ్చింది. బీపీ అదుపులో ఉండడానికి సిట్రస్ పండ్లు చాలా మేలు చేస్తాయట. వీటిలో పుష్కలంగా ఉండే పొటాషియం, శరీరంలోని అధిక సోడియంను బయటకు పంపి, రక్తనాళాలను సడలించడంలో సహాయపడతాయని.. తద్వారా రక్తపోటు తగ్గించడానికి దోహదపడతాయని అంటున్నారు. అందుకే.. ద్రాక్ష, నారింజ, నిమ్మ వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ విషయాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కు సంబంధించిన "నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ వెబ్‌సైట్‌లో ప్రచురించింది.(రిపోర్ట్ కోసం ఇక్కడ క్లిక్ చేయండి)

చేపలు: హైబీపీతో బాధపడే వారు చేపలు తినడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయని చెబుతున్నారు. ముఖ్యంగా చేపల్లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ రక్తనాళాలను సడలించి, రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయంటున్నారు. అంతేకాకుండా, ఇవి రక్తం గడ్డకట్టకుండా చేసి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని వివరిస్తున్నారు.

ఆకుకూరలు: ఆకుకూరలు కూడా ఆరోగ్యానికి మేలు చేసే వాటిలో ముందుంటాయి. ముఖ్యంగా పాలకూర, బచ్చలికూర వంటి వాటిలో పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయని.. బీపీని అదుపులో ఉంచుతుందని అంటున్నారు. అలాగే వీటిల్లోని ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుందని అంటున్నారు.


గింజలు: ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందించడమే కాకుండా, హైబీపీని నియంత్రించడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని నిపుణులు అంటున్నారు. ఇవి ఫైబర్, అర్జినైన్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటాయని.. అర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్‌ను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుందంటున్నారు. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలను విశాలం చేయడానికి సహాయపడుతుందని.. దీంతో రక్త ప్రవాహం సులభంగా జరిగి, రక్తపోటు తగ్గుతుందని అంటున్నారు.

బెర్రీలు: బెర్రీలలో ఆంథోసైనిన్లు ఉన్నాయని.. ఇవి ఆంథోసైనిన్లు రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలను పెంచుతాయని, రక్త ప్రవాహాన్ని నిరోధించే అణువుల ఉత్పత్తిని తగ్గించి రక్తపోటు అదుపులో ఉంచేందుకు సహాయపడవచ్చని అంటున్నారు.

ఆలివ్? ఆయిల్?: ఆలివ్ ఆయిల్‌లో ఒలేయిక్ యాసిడ్ అధికంగా ఉంటుందని.. ఇది రక్తనాళాలను సడలించి, రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుందని.. తద్వారా బీపీ అదుపులో ఉంటుందని అంటున్నారు. అలాగే ఇది శరీరంలోని మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి, చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుందని అంటున్నారు. ఇవే కాకుండా.. తృణధాన్యాలు, క్యారెట్లు, గుడ్లు, టమాటా, బ్రోకలీ, పెరుగు, కివీ, లీన్ మాంసాలు వంటివి కూడా హైపర్‌టెన్షన్ తగ్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

గమనిక:ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# పీఆర్, పర్సనల్ మేనేజర్ ను తొలగించిన చిరంజీవి..



**టి మీడియా, డిసెంబర్ 25,హైదరాబాద్:** తన పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్ జీకే మోహన్, పర్సనల్ మేనేజర్ బాబీలను మెగాస్టార్ చిరంజీవి తొలగించారు. చిరంజీవి పర్సనల్, ప్రొఫెషనల్ అకౌంట్స్ కు సంబంధించిన డాక్యుమెంటేషన్ లో పొరపాట్లు ఉన్నట్టు గ్రౌండ్ స్టాఫ్ చిరంజీవి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేపట్టగా మోహన్, బాబీల అక్రమాలు ఉన్నట్టు బయటపడింది. దీనిపై చిరంజీవి ఆరా తీయగా వారు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. దీంతో వెంటనే ఇద్దరినీ ఉద్యోగాల నుంచి తొలగించినట్టు సమాచారం. మరోవైపు రియాల్టీ షో బిగ్ బాస్ లో పాల్గొన్న ఓ కంటెస్టెంట్ తో జీకే మోహన్ అఫైర్ కొనసాగిస్తున్నట్టు తెలుస్తోంది. ఆయనను ఉద్యోగం నుంచి తొలగించడానికి ఇది కూడా ఒక కారణం అనే గుసగుసలు వినిపిస్తున్నాయి

# క్రిస్టియన్ ల సర్వతోముఖాభివృద్ధికి కృషి

**-మంత్రి తుమ్మల నాగేశ్వర రావులి**



**టి మీడియా, డిసెంబర్ 25,ఖమ్మం:** క్రిస్టియన్ మైనార్టీల సర్వతో ముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చి కాంపౌండ్ లోని సిఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్, బిషప్ లు మంత్రికి ఆశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,లి ప్రేమ, కరుణ, సహనం, శాంతి, త్యాగం, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని లోక రక్షకుడు యేసు ప్రభువు అందించిన మహోన్నతమైన సందేశం అందరికీ ఆదర్శమని, ఆ ప్రభువు చల్లని చూపు ప్రజల మీద ఉండాలని, అందరూ బాగుండాలని, ప్రభువు ఆశీస్సులతో ప్రజలకు మరింత సేవలు అందించేలా శక్తినివ్వాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి క్రిస్టియన్ మైనారిటీ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, క్రిస్టియన్ మైనారిటీలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# 15 మీటర్ల ఎత్తు వరకు స్వీయ ధ్రువీకరణ

**- నిర్మాణాల అనుమతులు సులువు**

**- జనవరి మొదటి వారంలో కొత్త జీవో..?**

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,అమరావతి :** భవన నిర్మాణ అనుమతుల్లో తీవ్ర జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులొచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. అవసరమైన పత్రాలు లేవంటూ కొర్రీలు వేయకుండా 15 మీటర్ల ఎత్తు వరకు స్వీయ ధ్రువీకరణ ఇస్తే సరిపోయేలా నిబంధనలను సడలిస్తోంది. 500 చదరపు మీటర్ల విస్తీర్ణం దాటిన అపార్ట్‌మెంట్లలో ఇకపై సెల్లార్‌కు అనుమతి ఇవ్వనుంది. భవన నిర్మాణంలో సడలించిన నిబంధనలపై కొత్త సంవత్సరంలో ప్రభుత్వం జీవో జారీ చేసే అవకాశం ఉంది.దరఖాస్తు చేసిన వెంటనే అనుమతి: భవన నిర్మాణమంతా ఒకెత్తు అయితే అనుమతులు పొందడం మరో ఎత్తు. అవసరమైన పత్రాలు జత చేయలేదంటూ తరుచూ కొర్రీలు, వీటికి తోడు వివిధ దశల్లో అక్రమ వసూళ్ల ఫలితంగా భవననిర్మాణాలకు అనుమతులంటేప్రజలుహడలిపోతున్నారు. దీనికి చెక్ పెట్టేలా భవన నిర్మాణాలకు దరఖాస్తు చేసిన వెంటనే అనుమతులొచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దరఖాస్తుదారుల స్వీయ ధ్రువీకరణపై 15 మీటర్ల ఎత్తు వరకు భవనాలకు అనుమతులివ్వనున్నారు. అందుకుగాను 500 చదరపు మీటర్ల విస్తీర్ణం దాటిన అపార్ట్‌మెంట్లలోసెల్లార్‌కుఅనుమతివ్వాలనినిర్ణయించింది. బహుళ అంతస్థుల భవన నిర్మాణ అనుమతులకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సింగిల్ విండో తీసుకొస్తున్నారు. దీనికి డీపీఎమ్?ఎస్ పోర్టల్‌కే ఇతర ప్రభుత్వ శాఖలను అనుసంధానిస్తున్నారు. వాటి ద్వారా చకచకా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. 120 మీటర్ల కంటే ఎత్తయిన భవనాల్లో సెట్ బ్యాక్ 20 మీటర్లకు కుదిస్తున్నారు. సవరించిన భవన నిర్మాణ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు పరిశీలించి జనవరి మొదటి వారంలో జీవో జారీ చేయనుంది.కొత్త నిబంధనలతో అక్రమ లే అవుట్?లకు చెక్: ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకోకుండా వేస్తున్న లే అవుట్ల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వాటిలో అంతర్గత రహదారులు 40 అడుగుల్లో ఉండాలన్న నిబంధనను 30 అడుగుల వెడల్పులో వేస్తే సరిపోయేలా నిబంధనలు నడలిస్తోంది. రోడ్లకే ఎక్కువ విస్తీర్ణం పోతుందన్న ఉద్దేశంతో చాలామంది అనుమతులు తీసుకోకుండా లే అవుట్లు వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది. అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొన్న ప్రజలు వాటిలో నిర్మాణాలకు అనుమతులు రాక ఇబ్బంది పడుతున్నారు. కొత్త నిబంధనలతో వీరందరికీ ఊరట దక్కనుంది.

ఆన్‌లైన్‌లోనే అనుమతులు బహుళ అంతస్థుల నిర్మాణాల విషయంలో ఇప్పటివరకు అగ్నిమాపక, ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి మొదట ఎన్?ఓసీ తీసుకున్నాకే డీపీఎమ్?ఎస్ పోర్టల్‌లో దరఖాస్తులు చేస్తున్నారు. ఆ రెండు శాఖల నుంచి ఎన్ఓసీలు అప్‌లోడ్ చేశాకే పోర్టల్ అనుమతిస్తోంది. కొత్తగా సింగిల్ విండో విధానంలో అనుమతులకు దరఖాస్తు అప్‌లోడ్ చేసి ఫీజులు చెల్లిస్తే చాలు. భవన నిర్మాణానికి అప్‌లోడ్ చేసిన దరఖాస్తులు ఇతర ప్రభుత్వ శాఖలకు వెళతాయి. సంబంధిత అధికారులు పరిశీలించి ఎన్ఓసీలను జారీ చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఇతర శాఖలు కూడా ఆన్‌లైన్‌లోనే అనుమతులివ్వనున్నాయి. అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు భవన నిర్మాణలి అనుమతులను ప్రభుత్వం ఎంతో సులభతరం చేసింది. ఇకపై ఎవరైనా అక్రమాలకు పాల్పడితే వారిపై కఠినంగా వ్యవహరించనుంది. ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాక వాటిపై పునఃపరిశీలన ఉంటుంది. ఫిర్యాదులపైనా విచారణ చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నారు. విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైతే ప్రభుత్వ గుర్తింపు పొందిన టెక్నికల్ పర్సన్లపై పోలీసు కేసు నమోదు చేసి వారి లైసెన్స్ రద్దు చేయనున్నారు. అంతేగాక భవన నిర్మాణ అనుమతులు వెనక్కి తీసుకుంటారు. ప్రభుత్వ స్థలంలో తప్పుడు దస్తావేజులు సృష్టించి వేరొకరి స్థలంలో నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు.

# జన్వాడ ఫాంహౌస్ కేసు

**- కొంతమందిని విచారించిన పోలీసులు**




**టి మీడియా, డిసెంబర్ 25, హైదరాబాద్ బ్యూరో : :** జన్వాడ ఫాంహౌస్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఫాంహౌస్‌లో పార్టీకి హాజరైన వారిలో కొందరిని పోలీసులు విచారించారు. మరికొంత మంది సాక్షులను త్వరలో విచారించనున్నారు. ఇప్పటికే విజయ్ మద్దూరి బ్లడ్ శాంపిల్స్‌ను ఎఫ్ఎస్-ఎల్‌కు పంపించిన మోకిలా పోలీసులు నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు .ఒక్కరికి డ్రగ్స్ పాజిటివ్ : జన్వాడలోని రాజ్‌పాకాల ఫామ్‌హౌస్‌లో పార్టీ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. భారీ శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్నట్లు తెలవగా పోలీసులు తనిఖీలు చేశారు. పార్టీలో పాల్గొన్న 24 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, విజయ్ మద్దూరి అనే వ్యక్తికి కొకైన్ తీసుకున్నట్లు తేలింది. దీంతో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. తనిఖీల్లో పోలీసులు కర్ణాటక, విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.డ్రగ్స్ ఎలా వచ్చాయి? ఎవరు సరఫరా చేశారు?' - జన్వాడ ఫామ్?హౌస్ కేసులో విజయ్? మద్దూరి విచారణఈ కేసులో ఏ1గా కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల, ఏ2గా విజయ్ మద్దూరిని చేర్చినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపారు. అయితే డ్రగ్స్ పాజిటివ్ వచ్చిన విజయ్‌ను పోలీసులు విచారించారు. ఎవరి దగ్గర నుంచి డ్రగ్స్ కొనుగోలు చేశారని ప్రశ్నించినట్లు తెలిసింది. దీపావళి సందర్భంగా నిర్వహించిన ఈ పార్టీలో తన వద్ద ఉన్న డ్రగ్స్‌ను పార్టీలో వినియోగించాలని రాజ్ పాకాల ప్రోత్సహించినట్లు విజయ్ మద్దూరి అంగికరించినట్లు పోలీసులు తెలిపారు. **నివేదిక ప్రకారం చర్యలు :** పోలీసుల విచారణ అనంతరం ఆయన మోకిలా పోలీసుల ఎదుట హాజరయ్యారు. పార్టీలో మాదకద్రవ్యాలు ఎక్కడి నుంచి వచ్చాయి? మీకు సరఫరా చేసింది ఎవరు? ఇప్పటివరకు ఎన్నిసార్లు డ్రగ్స్ తీసుకున్నారు? అనే కోణంలో పోలీసులు విజయ్? మద్దూరిని ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై దర్యాప్తు చేస్తున్న మోకిలా పోలీసులు పార్టీకి హాజరైన కొందరిని విచారించారు. మరికొంతమంది సాక్షులను త్వరలో విచారించనున్నారు.

# బోల్తాపడిన ధాన్యం లారీ

**-డ్రైవర్ క్లీనర్ కు గాయాలు**


**-ఆస్పత్రికి తరలింపు**



**టీ మీడియా , డిసెంబర్ 25,కారేపల్లి:** ఐకెపి కొనుగోలు కేంద్రం నుండి బయలుదేరిన ధాన్యం లారీ కారేపల్లి క్రాస్ రోడ్ పెట్రోల్ బంక్ ఎదురుగా బుధవారం రాత్రి అదుపుతప్పి బోల్తా పడింది ఈ ప్రమాదంలో డ్రైవర్ కు తీవ్ర గాయాలు కాగా క్లీనర్ కు గాయాలయ్యాయి కామేపల్లి మండలం జోగుగూడెం నుండి ఐకెపి వరిధాన్యము కొనుగోలు కేంద్రం నుండి 320 క్వింటాల ధాన్యంతో వెళుతున్న లారీ క్రాస్ రోడ్ పెట్రోల్ బంక్ ఎదురుగా డ్రైవర్ తప్ప తాగి ఉండడంతో అదుపుతప్పి పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.లారీ పడిపోవడంతో ధాన్యం బస్తాలు చల్లా చదురుగా పడిపోయాయి గాయాల పాలైన డ్రైవర్ క్లీనర్ ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న కారేపల్లి ఎస్ఐ రాజారాం ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

# క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,చిన్న చింతకుంట :**దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో , చిన్న చింతకుంట మండల కేంద్రం, నెల్లికొండి, ఉంద్యాల గ్రామాలలో క్రిస్మస్ పర్వదినం సందర్భంగా చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రైస్తవలకు క్రిస్మస్ శుభాకాంక్షలు. కరుణామయుడు జీసస్ పుట్టిన రోజున మీ జీవితంలో ఆనందాలు నిండాలని శాంతి సౌభాగ్యాలతో కలగాలని, తాను జీసస్ ను కోరుకుంటున్నాను అని క్రైస్తవ సోదర సోదరీమణుల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి.




# సీఎం రేవంత్ రెడ్డితో సినీప్రముఖుల భేటీ.

**-ఏం జరగనుంది.. ?**



**టి మీడియా, డిసెంబర్ 25, హైదరాబాద్ బ్యూరో :**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సినీ ప్రముఖులు కలవనున్నారు. డిసెంబర్ 26న ఇండస్ట్రీలోని పలువురు ప్రముఖులు, దర్శకనిర్మాతలు సీఎం రేవంత్ రెడ్డితో సమావేశం కానున్నారని ఎఫ్?డీసీ ఛైర్మన్ దిల్ రాజ్ తెలిపారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ ను నిర్మాత దిల్ రాజ్, నిర్మాత అల్లు అరవింద్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని టాలీవుడ్ పెద్దలు కలవనున్నట్లు ప్రకటించారు దిల్ రాజ్. ఈ భేటీకి సంబంధించి ఇప్పటికే సీఎంవో నుంచి సైతం అనుమతి లభించిందని అన్నారు. ఇప్పటికే బాలుడు శ్రీతేజ్ కుటుంబానికి రూ.2 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. అల్లు అర్జున్ రూ.1 కోటి.. డైరెక్టర్ సుకుమార్ రూ.50 లక్షలు.. పుష్ప నిర్మాతలు రూ.50 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి టాలీవుడ్ నుంచి మెగాస్టార్ చిరంజీవి, వెంకటేష్, అల్లు అరవింద్, పలువురు నిర్మాతలు, దర్శకులు.. ప్రభుత్వం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్, దామోదర రాజనర్సింహాతోపాటు మరికొందరు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో తాజా పరిణామాలు, సినిమా పరిశ్రమ సమస్యలు, ఇండస్ట్రీ అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య వారధిగా తాను ఉంటానని దిల్ రాజు అన్నారు.సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన ఇండస్ట్రీలో రేవతి అనే మహిళ మరణించిన సంగతి తెలిసిందే. ఆమె కొడుకు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడగా.. కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం దిల్ రాజు, అల్లు అరవింద్.. శ్రీతేజ్ ను పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ్ తొందరగా కోలుకుంటున్నాడని.. 72 గంటల నుంచి వెంటిలేటర్ లేకుండా ఉన్నాడని నిర్మాత దిల్ రాజు తెలిపారు. అయితే సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన కేసులో టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ ను ఇదివరకే పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బన్నీ మధ్యంతర బెయిల్ పై బయటకు వచ్చారు.

# అమ్మబాబోయ్.. 11 పులులు వచ్చాయ్..

**-ఆదిలాబాద్ జిల్లాకు టైగర్ టెన్షన్**



**టి మీడియా, డిసెంబర్ 25, ఉమ్మడి ఆదిలాబాద్:** జిల్లాను టైగర్ టెన్షన్ వీడటం లేదు. గతంలో ఉన్న రెండు పులులు కాస్తా..తర్వాత నాలుగయ్యాయి అయ్యాయి. ఆ నాలుగు కాస్తా ఇప్పుడు 11 పులులు అయ్యాయి. కొమురంభీం- మంచిర్యాల సరిహద్దుల్లో మొత్తం 11 పులులు సంచరిస్తుండటంతో.. ఇదిగో టైగర్.. అదిగో పెద్దపులి అనే హెచ్చరికలతో స్థానికులు గజగజ వణికిపోతున్నారు. పులుల సంచారంతో రోజువారీ పనులకు కోసం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.. అటవీ సమీప గ్రామాల ప్రజలు. కొమురంభీం- మంచిర్యాల జిల్లాల సరిహద్దుల్లో మొత్తం 11 పులుల సంచరిస్తున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు చెబుతున్నారు.. ఏటా చలికాలంలో ఇక్కడికి తోడు కోసం వస్తూ అడవుల్లో సంచరిస్తున్నాయి పులులు. తాజాగా ఎర్రగుంట గ్రామ శివారులో పులి కదలికలను గుర్తించారు అటవీ శాఖ అధికారులు. బొంబాయిగూడ గ్రామ శివారులోని ఉచ్చమల్ల వాగుతో పాటు సమీప పంట చేనుల్లో పులి పాదముద్రలను చూశారు మేకలకాపరులు. అటు మంచిర్యాల జిల్లా ముల్కల్ల బీట్ పరిధిలోను మరో ఆడపులి సంచారాన్ని అటవీ అధికారులు గుర్తించారు. ముల్కల్ల బీట్ సఫారీ రోడ్‌పై ట్రాప్ కెమెరాల కంటపడింది మరో ఆడ పులి. మంచిర్యాల జిల్లాలోనే మగపులి కూడా సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. మందమర్రి, అందుగుల పేట, తాండూరు మండలం నీలాయపల్లి సమీపంలో పులి సంచారం కలకలం రేపుతోంది.పులల సంచారంతో అలర్ట్ అయిన అటవీశాఖ అధికారులు..స్థానికులను అప్రమత్తం చేస్తున్నారు. బైక్‌లపై తిరుగుతూ గ్రామాల్లో చాటింపు వేయిస్తున్నారు. మరోవైపు పొలాల్లో పనిచేస్తున్నవారిపై వెనకనుండి పులి దాడిచేయకుండా.. వారికి మాస్కులు పెడుతున్నారు.జిల్లాను ఓ వైపు పులి భయం వెంటాడుతుంటే.. మరోవైపు అదే పులిపై పంచాయితీ మొదలయింది.. పులి సంచారం పేరుతో గిరిజనులను పోడు భూములకు దూరం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్నారు సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు.. కాగజ్‌నగర్‌ను టైగర్ జోన్ చేయాలన్న ఆలోచనలను అటవీశాఖ విరమించుకోవాలని హెచ్చరికలు చేశారు ఎమ్మెల్యే.. ప్రజాభిప్రాయం లేకుండా టైగర్ జోన్ ఏర్పాటు చేస్తారా? పులి నుండి మనుషులను..మనుషుల నుండి పులులను రక్షించలేరా? అంటూ ప్రశ్నించారు.

# ఇదంతా బిజెపి పన్నిన కుట్ర : ఢిల్లీ సిఎం అతిషి




**టి మీడియా, డిసెంబర్ 25,న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది ఢిల్లీ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ మహిళా సమ్మాన్ యోజన, వృద్ధుల చికిత్స కోసం 'సంజీవని యోజన' పథకాలను ప్రకటించారు. అయితే ఈ పథకాలను ప్రభుత్వం నోటిఫై చేయలేదని పబ్లిక్ నోటీస్ రిలీజ్ అయింది. ఇది బుధవారం ఢిల్లీలోని అన్ని ప్రధాన పత్రికల్లో అయింది. ఈ నోటీస్‌పై బిజెపి నేతలు తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేజ్రీవాల్ ప్రజల్ని మోసం చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. ఎన్నికల కోసమే హామీలను ప్రకటించారని, వాటిని ఇప్పుడు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. బిజెపి నేతల విమర్శలపై ఢిల్లీ సిఎం అతిషి స్పందించారు. ఆ వార్తలు అవాస్తవమని ఆమె స్పష్టం చేశారు. 'ఈరోజు వార్తా పత్రికల్లో అచ్చయిన పబ్లిక్ నోటీస్‌లు తప్పుడువి. బిజెపి నేతల ఒత్తిడి మేరకు ప్రభుత్వంలోని కొందరు అధికారులు ఆ నోటీస్‌లు ఇచ్చారు. ఇదంతా బీజేపీ కుట్ర. ఈ తప్పుడు నోటీస్ ఇచ్చిన అధికారులపై పాలనా యంత్రాంగం, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారు. మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలు ఇప్పటికే ప్రజా బాహుళ్యంలోకి వెళ్లాయి. వాటిని కచ్చితంగా అమల్లోకి తీసుకొస్తాం' అని సీఎం అతిషి హామీ ఇచ్చారు.

# ఘనంగా వాజ్పేయి జయంతి

**టి మీడియా, డిసెంబర్25 ,మక్తల్ :**భారతీయ జనతా పార్టీ మక్తల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వాజ్పేయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కొండయ్య అనంతరం కొండయ్య మాట్లాడుతూ ఈ జీవితం దేహం కోసం కాదు దేశం కోసమని తన జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప మహానుభావుడని అలాగే రాజకీయ వ్యవస్థను ఎలా సమర్థవంతంగా నడిపి రాజకీయ వ్యవస్థకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఒక అట్టల్ బిహారీ వాజ్పేయి గుర్తుకు రావడం దేశానికి గర్వకారణం.ఒక కవిగా రాజనీతి జ్ఞానుడిగా కర్మయోగిగా భారతీయ జనతా పార్టీకి విశిష్ట సేవలు అందించి ఒక మహెూన్నత వ్యక్తిత్వంతో ఎన్నో అవమానాలు ఎదుర్కొని ఏనాడు కృంగిపోకుండా రెండు ఎంపీ స్థానాలు పరిమితమైన కూడా ఏనాడు పార్లమెంటులో దిగ్భ్రాంతి చెందకుండా అంధకారం అస్తమిస్తుంది సూర్యుడు ఉదయిస్తాడు కమలం వికసిస్తుంది అని చెప్పి నేటి కళలని పార్టీ పరిస్థితిని చెప్పిన గొప్ప నాయకుడు అటల్ బిహారీ వాజ్పేయి అని ప్రస్తుతం వారి బాటలో భారత ప్రధాని నరేంద్ర మోడీ దేశ శ్రేయస్సు కోసం తన జీవితాన్ని త్రునప్రాయంగా సమర్పించి దేశంలోనే భారతీయ జనతా పార్టీని అతిపెద్ద పార్టీగా నిలబెట్టి వాజ్పేయి గారి మార్గదర్శకాలలో నడిచి ఇలా ప్రతి కార్యకర్త గతంలో నడిచిన ఎందరో మహానుభావులను వారి మార్గదర్శకాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని పాటి పటిష్టతకు కృషి చేయాలని ఆయన కోరారు.వాజ్పేయి జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం మరియు రాంలీల మైదానంలో బిజెపి నాయకుల ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శంకరోల రవికుమార్, కర్నె స్వామి,%ణ%.నరసింహ రెడ్డి చీరల సత్యనారాయణ రాజశేఖర్ రెడ్డి,రేణుకా నరసింహ, శ్రీనివాస్ రెడ్డి బలరాం రెడ్డి, టైలర్ ఆంజనేయులు, రంకుల ఆంజనేయులు, కూర్వ లింగం, పికే.నరసింహ రామ్ మాధవ్, రాజాగౌడ్, బ్యాటరీ రాజు,టప్ప శీను,హెూటల్ రాజశేఖర్,దండు అశోక్ బిజెపి సీనియర్ నాయకుడు తదితరులు పాల్గొన్నారు.



# కారేపల్లి లో ప్రారంభమైన టిడిపి సభ్యత్వ నమోదు

**టీ మీడియా, డిసెంబర్ 25,కారేపల్లి :**తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం మండలంలో కొనసాగుతుందని జిల్లా నాయకులు మండేపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం కారేపల్లి లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకర్తలకు సభ్యత్వ నమోదు కార్డులను అందజేసి ఈ సందర్భంగా మండేపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం సభ్యత్వ నమోదు కార్యక్రమం పరిశీలిస్తుంటే పార్టీకి త్వరలోనే పూర్వ వైభవం రానుందన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా సుమారు 1800 మంది స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకున్నరన్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష ఇరవై వేల సభ్యత్వలు నమోదయ్యాయని, రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో ఉందన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో లేకపోయినా కార్యకర్తలు చెక్కుచెదరలేదు అనడానికి ప్రస్తుతం జరుగుతున్న సభ్యత్వాలే నిదర్శనంగా కనిపిస్తాయన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి రెండు సంవత్సరాల కాల పరిమితితో ఐదు లక్షల ప్రమాద బీమా, ఇతర సౌకర్యాలు కలుగునున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చిన్ని శ్రీనివాసరావు, దుగ్గెంపూడి కొండలరావు, గంగరబోయిన శ్రీనివాసరావు, పెద్దమ్మ సత్యం, ఎలగందుల మధు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, వీరభద్ర, ఉపేందర్, లక్ష్మీనారాయణ, యాకూబ్ రావ్, కృష్ణ, ఆర్ నాగేశ్వరరావు, గోవర్ధన చారి తదితరులు పాల్గొన్నారు.



# ఈ పాలసీ స్టడీ కమిటీ మెంబర్ గా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,ఆత్మకూర్ :**ఎం ఎస్ ఎం ఈ పాలసీ 2024 – స్టడీ కమిటీ సభ్యునిగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఎంపికయ్యారు. బీసీలు(వెనకబడిన వర్గాలు) సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు స్థాపించేందుకు కృషి చేయడంతో పాటు బీసీ లను పారిశ్రామికవేత్తలుగా అవకాశాలు కల్పించి, వారిని అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగంగా ఎమ్మెస్ఎంఈ పాలసీ 2024 స్టడీ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసింది. ఇందులో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు ఇతర సభ్యులుగా రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, షాద్నగర్ ఎమ్మెల్యే శంకరయ్య, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో పాటు బీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ , బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ , రిటైర్డ్ ఐఏఎస్ లు చిరంజీవులు, ప్రభాకర్, దినకర బాబు ఇతర సభ్యులు చుక్కా కొండయ్య, అలోక్ కుమార్, మల్లయ్య బాబు లతో కలిపి మొత్తం 15 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధానంగా బీసీలు పరిశ్రమలను స్థాపించడంలో వెనుకబడటంతో... ఒక కమిటీ వేసి బీసీలు ఎక్కువ సంఖ్యలో చిన్న సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమలు స్థాపించేలా వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందజేస్తూ తగిన సౌకర్యాలు కల్పించి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దటమే కమిటీ ఏర్పాటులో ముఖ్య ఉద్దేశమని, ఈ కమిటీ ఈ అంశాలు అన్నింటి పైనా అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. బీసీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అందులో భాగంగానే తనను కమిటీలో సభ్యునిగా ప్రకటించిన సీఎం రేవంత్ తో పాటు మంత్రులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ధన్యవాదాలు తెలిపారు



## మాజీ ఎం.పి మంద జగన్నాథంను పరామర్శ

**-మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ,రావుల**

**టీ మీడియా, డిసెంబర్ 25, వనపర్తి బ్యూరో :** నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎం.పి మంద జగన్నాథం అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జగన్నాథం ని పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు.వారి కుమారుడు శ్రీనాథ్ ను పలకరించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన రావుల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎం.పి, బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రావుల.చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించి వారి ఆరోగ్యం గూర్చి వాకబు చేశారు.కుటుంబ సభ్యులు తమ్ముడు మాజీ ఎం.పి.పి వేంకట్ కుమార్,కుమారుడు శ్రీనాథ్ ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



## గురుస్వామిని ఘనంగా సన్మానించిన బారాస నేతలు

**టీ మీడియా, డిసెంబర్ 25, వనపర్తి బ్యూరో :** సంద.రమేష్ గురుస్వామి 18 వ మహాపడి పూజ సందర్భంగా రమేష్ గురుస్వామిని బారాస నేతలు జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడ్ , కౌన్సిలర్ కాగితాల లక్ష్మి నారాయణ ఘనంగా సన్మానించారు. బాల ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగిన అయ్యప్ప పూజ సంద రమేష్ 18 వ సారి మాల ధరించి నారికేళ స్వామి గా శబరి యాత్ర సందర్భంగా నిర్వహించిన మహాపడి పూజ ఉదయం గణపతి పూజ సుబ్రమణ్య స్వామి పూజ అయ్యప్ప అభిషేకం అష్టోత్తరం పడి పూజ గణాంగ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్వాములు చంద్రశేఖర్, బోలేమోని నరసింహ, కానిస్టేబుల్ శ్రీను, మల్లీ పాల్గొన్నారు.




## క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన -జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి

**టీ మీడియా ,డిసెంబర్ 25, ఆత్మకూరు :**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల గ్రామంలో శ్రీ సరళ దేవి లక్ష్మారెడ్డి క్రీడా ప్రాంగణాని బుధవారం రోజు వనపర్తి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి సుధీర్ రెడ్డి పరిశీలించారు. కబడి క్రీడా మైదానాని అక్కడ ఏర్పాటులను వారు పరిశీలించారు. క్రీడా మైదానానికి కావలసిన సామాగ్రిని నివేదికను సేకరించారు. అట్టి నివేదికను వనపర్తి జిల్లా కలెక్టర్కు సమర్పిస్తామని వారి ద్వారా కావాల్సిన సదుపాయలను సమకూర్చే విధంగా చూస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం మూలమల్ల గ్రామ కబడ్డీ క్రీడాకారులను ఆయన అభినందించారు.ఇట్టి కార్యక్రమంలో వనపర్తి జిల్లా కబడి ఆర్గనైజేషన్ సెక్రటరీ పిఈటి కురుమయ్య, గ్రామ కబడ్డీ క్రీడాకారులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## వివాహా రిసెప్షన్ లో పాల్గొన్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

**టీ మీడియా, డిసెంబర్ 25, ,వనపర్తి బ్యూరో :** హైదరాబాద్ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ నాయకులు ఖమ్మర్ మియా తమ్ముడు కుమారుడు మునీబ్ వివాహా రిసెప్షన్ లో పాల్గొన్న జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు .డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి స్టేట్ ఏఐపీసి కోఆర్డినేటర్ . వారి ఆహ్వానం మేరకు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖమ్మర్ మియా, అక్తర్, షాంసుద్దీన్, అసిఫ్ పాల్గొన్నారు.అనంతరంఏదుల మండలం అనంతపురం గ్రామానికి చెందిన సంజీవ్ రెడ్డి కూతురు ఎంగేజ్మెంట్ లో జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు.చిన్నారెడ్డి ఇద్దరినీ ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## న్యూ లక్ష్మీపురంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**టీ మీడియా, డిసెంబర్ 25, ముదిగొండ :** ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో ఇమ్మానుయేలు ప్రార్థన మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ముదిగొండ మండల పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్చార్జి, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దేవరపల్లి అనంత రెడ్డి,మాజీ సర్పంచ్ వాకదాని కన్నయ్య ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి వారికి సహాయపడుతూ వారి కష్ట సుఖాలలో పాలు పంచుకుంటూ మనం ఎదుగుతూ మనతో పాటే వారి ఎదుగుదలకు చేయుతనివ్వాలి ఇలా యేసు ప్రభు మార్గంలో మనం అందరం నడుస్తూ ఆయనని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రసంగీకులు బ్రదర్ వై.డేవిడ్ రాజు మాట్లాడుతూ 'క్రైస్తవ మతాన్ని అనుసరించే వారందరికీ అత్యంత ప్రాముఖ్యం కలిగిన పండగ క్రిస్మస్. అందరినీ కలిపి బంధాలను బలోపేతం చేస్తుంది. ఏసుక్రీస్తులో ఉన్న ప్రేమ, సంతోషానికి కృతజ్ఞత తెలిపే అవకాశాన్ని ఇస్తుంది' అని అన్నారు.వారి వెంట మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, గోపాలరావు, వాకదాని కన్నయ్య, కొమ్ము ఉపేందర్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.



## క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే

**టీ మీడియా ,డిసెంబరు 25 ,ఆత్మకూరు** అమరచింత మండలంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా నాగల్ కద్మూరు, అమరచింత పట్టణం లో యం బి కర్మెల్ చర్చ్ క్రిస్మస్ సంబరాలలో పాల్గొన్న మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి . ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి, పిల్లలకు తినిపిస్తూ, అందరికీ క్రిస్మస్ పండగ శుభాకాంక్షలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ప్రకాశం ,యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు శ్యామ్ ,మాజీ ఎంపీటీసీ తిరుమలేష్ , రాజు ,బాల్ రాజు , సుభాష్ ,ప్రసన్న ,రవి ,గోపి ,రవి, దిల్ , శరత్ , సుధాకర్ , ఏసేపు, నాగల్ కద్మూరు గ్రామ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి,మహ్మద్ గ,నర్సింలు గౌడ్ , వేంకటేశ్వర రెడ్డి , లక్ష్మా రెడ్డి ,శివ ,చెన్నా రెడ్డి ,మునెప్ప ,బీరప్ప ,రాము ,పట్టణ,మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**టీ మీడియా, డిసెంబర్ 25, వనపర్తి బ్యూరో :** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా వనపర్తి పట్టణంలోని కల్వరి టౌన్ చర్చి యందు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కల్వరి టౌన్ చర్చ్ పాస్టర్ జాన్ రాజు ఏసుక్రీస్తు జననము గురించి బోధిస్తూ సువార్త ప్రకటించారు. అంతకు ముందు ఉదయం ఏడు గంటలకు వనపర్తి పట్టణంలోని నర్సింగాయపల్లి దగ్గర ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. అనంతరం క్రైస్తవులందరూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్వరి టౌన్ చర్చ్ పాస్టర్ జాన్ రాజ్, చర్చి సెక్రటరీ గంధం ప్రసాద్, డి యాకోబు, కే కేశవులు, జాన్ మార్క్ గిద్యోను, గంధం పరంజ్యోతి, డీ జాను, డి రవికుమార్, జీడి ప్రభాకర్, గంధం భాస్కర్, గంధం రంగస్వామి, అరుణ్,గంధం రాజు, గంధం దాసు, టీచర్ ప్రసాద్, జీ రవి,గొర్ల దాసు, పాస్టర్ అమ్మ గ్రేస్ జాన్, రజిని, సువర్ణ, రేణుక, సుగుణ, కమల, బాలేశ్వరమ్మ, బాలమణి, జయమ్మ, ఇందిరా, లతా, ఏమి మా, క్రిస్మస్ కేక్ కట్ చేసి హ్యాపీ హ్యాపీ క్రిస్మస్ మేరీ మేరీ క్రిస్మస్ అని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**-పాస్టర్ ముర్రం డేవిడ్**



**టీ మీడియా,డిసెంబర్ 25,ములుగు బ్యూరో:** ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని మొర్రవనిగూడెంలోని జి టి ఎస్ ఎస్ ఎస్ ప్రార్థన మందిరంలో క్రిస్టమస్ పండుగ ను ఘనంగా నిర్వహించారు. పర్వదినం సందర్భంగా మందిరంలో ప్రపంచంలో క్రీస్తు జననం సంతోషకరమని ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి అనేకమందికి రక్షకుడుగా ఉన్నాడని ఇటువంటి పండుగలు జరుపుకోవడం చాలా సంతోషమని సంఘ కాపరి ముర్రం డేవిడ్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు . ఏసుక్రీస్తు లోక రక్షకుడు అని యేసు క్రీస్తు ద్వారా శాంతి సమాధానం కలుగుతుందని, ప్రపంచ దేశాలలో పండుగగా నిర్వహించుకునే ఏకైక పండుగ క్రిస్టమస్ అని వారు తెలియజేశారు. ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. చర్చిలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు చర్చిలో ఆవరణంలో స్టార్ , క్రిస్మస్ తాత ఏర్పాటు చేశారు. విశ్వాసులకు ఆశీస్సులు అందజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ మొర్రం ఇసాక్, మొర్రం డేవిడ్ , విక్టోరియా, కోడేపే ఏలీయా, ఆగస్టీన్, జ్యోతి, ఎనాసు, నయొమి, సున్నం యేసు,విశ్వాసులు గ్రామస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఇళ్లమధ్య ఉన్న కంపచెట్ల తొలగింపు

**టీ మీడియా, డిసెంబర్ 25, వనపర్తి బ్యూరో :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి కంపచెట్ల నుండి పురుగులు, పాములు వస్తున్నందు వలన ఇట్టి కంప చెట్టును తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జె ఆశన్న రాత్రి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మేఘా రెడ్డి తక్షణమే శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజును ఆదేశించగా శ్రీహరి రాజు ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో జెసిబి తో బుధవారం ఉదయం ఇళ్ల మధ్యలో ఉన్నటువంటి కంపెచెట్లను ఎస్సీ కాలనీ స్కూల్ పక్కన ఉన్నటువంటి కంప చెట్లను తొలగించడం జరిగింది.ఎస్సీ కాలనీ ప్రజలు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని అడిగిన వెంటనే స్పందించి శ్రీహరి రాజు తో చెప్పి తొలగించిన అందుకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కి కృతజ్ఞతలు తెలియ జేశారు.



## వాజపేయి శతజయంతి వేడుకలు

**టీ మీడియా, డిసెంబర్ 25, అశ్వరావుపేట:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం భారతీయ జనతా పార్టీ మాజీ ప్రధాని అటల్ బిహారీ . 100 వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిజెపి ఆఫీసు నందు ధారా నాగేశ్వరావు ఆధ్వర్యంలో . కేక్ కట్ చేసి తదుపరిదారా నాగేశ్వరావు మాట్లాడుతూ వాజపేయి నాయకత్వం లో దేశం అభివృద్ధినీ చూసి ఈ కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన దినోత్సవం ప్రకటించారు .బైక్ ర్యాలీతో ముందుగా గవర్నమెంట్ హాస్పిటల్ లో రోగులకు పండ్లు స్వీట్లు పంచిపెట్టారు. హాస్పిటల్, లో స్వచ్ఛ భారత్ చేసినారు.తదుపరి మోటార్ సైకిల్ ర్యాలీ తో మందలపల్లి సెంటరికి వెళ్ళినారు.అక్కడ పసుపులేటీ నాగరాజుతో కేక్ కటింగ్ చేసినారు. ఈ కార్య క్రమనికి ఉడతనేని విశ్వేశ్వర రావు,పూచిప్రసాద్,గోడంముత్యాలరావు,పసుమర్తిపుల్లారావు,సీతారాములు,రత్నకుమారి,సుజాత,గ్రంధి గుప్త,దొడ్డ సతీష్, సూరి మల్లికార్జున రావు, కార్యకర్తలు ,అభిమానులు పాల్గొన్నారు.



## దృఢత్వానికి మనోధర్యం ఉండాలి..

**-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని తో**

**-ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్**

**టీ.మీడియాడిసెంబర్25,చింతూరు:** తెలంగాణ రాష్ట్ర సిపిఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నిమ్మల గూడెం గ్రామంలో ఉన్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సెట్ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ఆశ్రమానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు కరచాలనం చేసుకొని ఉత్సాహభరిత వాతావరణం లో మాట మంతి కొనసాగించారు. జమాల్ ఖాన్ సేవా కార్యక్రమాలను మీడియా మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వీరభద్రం మాట్లాడుతూ ప్రపంచానికి ప్రస్తుతం కావాల్సింది ఆరోగ్యం అందించే నాణ్యమైన వైద్యమే అని నేటి సమాజంలో రసాయనిక జంక్ ఫుడ్స్ కలుషిత ఆహారాలు తీసుకుంటున్న మనుషులు రోజుకో కొత్త వ్యాధులతో బాధపడుతున్నారని దీనివల్ల కుటుంబానికి దేశ ఆర్థిక వ్యవస్థ పై తీరని ప్రభావం పడుతుందని అన్నారు. జమాల్ ఖాన్ మాట్లాడుతూ ఆయుష్ కంపెనీ అటవీ శాఖ వారు ముందుకు వచ్చి సహకరిస్తే విలువైన ఔషధ మొక్కలు పెంచే దిశగా ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు అంతర్జాతీయ మార్కెట్లో కూడా ఔషధ మూలికలు అందించే దిశగా కృషి చేయవచ్చన్నారు.



## అనంత బాబు ఆరోపణలు

**-దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది:టీడీపీ.**

**టీ.మీడియా,డిసెంబర్25,చింతూరు:**బినామీ లతో ఎల్టిఅర్ కేసుల్లో ఇరికించి కోట్ల రూపాయలు వసూలు చేసిన ఘనుడు డోర్ డెలివరీ అనంత బాబు.ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి స్వతహాగా పరిపాలనా చేస్తుంటే ఓర్చుకోలేక ఆరోపణలు చేస్తూ ఉంటాం హాస్యాస్పదం.గిరిజన,గిరిజనేతర ఐక్యతకు భంగం కల్పిస్తూ రెచ్చగొట్టడం సరైన విధానం కాదు.ఎల్టీఆర్ కేసులు పెట్టించింది ఎవరో?వాటిని బినామీ లతో తిరగతొడుతుంది ఎవరో? ప్రజలకు తెలుసు. ప్రజా ప్రభుత్వం పై ప్రజా నాయకులపై మీరు ఎంత విష ప్రచారం చేసిన ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరు.మీ పరిపాలనా అంత డమ్మీ ఎమ్మెల్యే లతో పరిపాలించిన తీరు ప్రజలకు తెలుసునని ఏల్టీఆర్, కరంట్ చార్జీలు, అభివృది పై మీరు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది. గత ప్రభుత్వ పాలనలో మీ నాయకత్వం లో ఎల్టిఅర్ కేసులు పెట్టించి ప్రజలను బయపెట్టించి సెటిల్ మెంట్ చేసుకొని కోట్ల రూపాయలు అక్రమ కలెక్షన్ చేసింది మీరు కదా? ఇప్పుడు మళ్ళీ మీ బినామీ తో ఎల్టిఅర్ కేసులు మళ్ళీ తిరిగ తొడిస్తు... ఆ నెపం ఆదివాసి ఎమ్మెల్యే పై నెటడం ఎంతవరకు సబబు? మా చింతూరు మండలం లో మీ ప్రియ శిష్యుడు మీ పార్టీ నాయకుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు కలెక్షన్ చేసి మీకు ఇచ్చింది నిజం కాదా? పోలీసు స్టేషను లో దౌర్జన్యాలు చేసింది నిజం కదా? నియోజకవర్గంలో ఆదివాసి ఎమ్మెల్యే స్వతహాగా పరిపాలిస్తుంటే ఓర్చుకోలేక అడుగడుగునా అడ్డుకోవడం మీకు తగునా? మీ సర్టిఫికెట్ డమ్మీ,మీ ఎమ్మెల్యే డమ్మీ,మీ పరిపాలనా డమ్మీ, అది చూసి ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా ప్రభుత్వం లో ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన అందిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే శ్రీమతి మిరియాల శిరీష దేవి పై, మా నాయకుడు విజయభాస్కర్ లపై అవకాలు చెవాకులు మాట్లాడితే చూస్తూ ఉండటానికి నీ చెంచాలు కాదు.మీ డోర్ డెలివరి పరిపాలనా,మీ డమ్మీల పరిపాలనా చూసి విసుగు చెందినప్రజలుతెలుగుదేశంకూటమినీగెలుపించుకొన్నారు. గిరిజన , గిరిగినేతర ఐక్యతకు భంగం కల్పిస్తూ రెచ్చగొట్టడం సరైన విధానం కాదని.. ప్రజలు బుద్ధి చెప్పిన ఇంక బుద్ధి రాలేదనీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంత బాబు ఆరోపణలను ఖండించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు అకోజు నూకాచరి,ఎస్టీ సెల్ అధ్యక్షుడు తుర్రం ముత్తయ్య, కారం వాసు, తుర్రమ్ సూర్యనారాయణ,సీనియర్ నాయకుడు అనిగి చంద్రయ్య, సొడి రాఘవయ్యసయ్యద్ ఆసీఫ్,కట్ట శంకర్, తెలుగు యువత అద్యక్షుడు గెడ్డం సురేష్ కుమార్ చౌదరితదితరులు పాల్గొన్నారు.



## సాగునీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా ,డిసెంబర్ 25 ,దేవరకద్ర:** దేవరకద్ర నియోజకవర్గం దేవరకద్ర మండలం లోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు నుంచి నేడు ఆయకట్టు రైతులకు యాసంగి పంటకు కుడి, ఎడమ కాలువల ద్వారా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూధన్ రెడ్డి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ కోయిల్ సాగర్ ప్రాజెక్టు కింద ఆయకట్టు రైతులకు ఈ యాసంగిలో 5 విడతలుగా సాగునీటిని విడుదల చేస్తున్నామని, అందులో భాగంగా నేడు తొలివిడత గా నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మరియు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పుట్టినరోజు వేడుకలకు హాజరైన ౨యువ నేత టీ.సాయి చరణ్ రెడ్డి

**టీ మీడియా, డిసెంబర్ 25, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య ఆహ్వానం మేరకు వారి అన్న కుమార్తె పుట్టినరోజు వేడుకలకు నియోజకవర్గ యువనేత సాయి చరణ్ రెడ్డి , మాజీ ఎంపీపీ సాన్నే కిచ్చారెడ్డి వారిని ఆశీర్వదించారు.పిల్లల జీవితంలో ఇలాంటి కార్యక్రమాలకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని, వారి ఆనందాలను తల్లిదండ్రులుగా గౌరవించాల్సిందే అని వారు పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో శ్రీరంగపురం కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, ఖిల్లా ఘనపూర్ కాంగ్రెస్ నాయకులు ఆగారం ప్రకాష్, ఖిల్లా ఘనపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, వేణుగోపాల్ , రవి నాయక్, రాము, క్యాంప్ ఆఫీస్ నందిపేట తిరుపతయ్య, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతి సందేశ రూపకర్త కారణజన్ముడు యేసు .

**-జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జమాల్ ఖాన్.**

**టీ.మీడియా,డిసెంబర్25,చింతూరు:** ప్రపంచానికి శాంతి సందేశం అందించిన రూపకర్త కారణజన్ముడు ఏసుక్రీస్తు జన్మదిన వేడుకల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ బుధవారం మండలంలోని సీఎస్ఐ చర్చ్, నిర్ణయ సంఘం చర్చ్, నిమ్మలగూడెంలోని ఏలిమో లలో జమాల్ ఖాన్ క్రీస్తు పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు ప్రపంచానికి రాకతో ప్రపంచ శాంతి కై పాపుల రక్షణకై రక్త తర్పణం చేసిన మహనీయుడని కొని ఆడారు. ప్రతి ఒక్కరూ సాటి మానవుల పట్ల సానుభూతి దయ గుణంతో మెలగాలని కలిగిన వారు పేదవారికి సహాయ సహకారాలు అందించి మానవత్వం చాటుకోవాలని అప్పుడే క్రీస్తు కన్న కలలు ఆయన ఆశయాలు నెరవేరుతాయి అన్నారు. పాపులను కరుణించి, రోగులను అక్కున చేర్చుకున్న దయా గుణశాలి ఏసుక్రీస్తుని ఈ సందర్భంగా ఆయన కీర్తించారు. అనంతరం నూతన సంవత్సర 2025 క్యాలెండరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు రియాజ్, రాచూరి శేఖర్, బిఎంఎస్ వైద్యులు లిఖిత, భవాని, హర్షియా, నాయకులు ముత్యాల శ్రీరామ్, సాల్మన్ రాజు, పొదిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

